క్లుప్తంగా

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ


శ్రీకాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో మంగళవారం కాళికాంబాదేవికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తర్వాత అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఒడి బియ్యం వేశారు. 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ చేశారు. అనంతరం మహా మంగళ హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బింగుమల్ల శ్యాంసుందర్



నంద్యాల(వ్యవసాయం): 2025–26 సంవత్సరానికి నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా బింగుమళ్ల శ్యాంసుందర్ గుప్త మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఆదేశాల మేరకు ఈ అధ్యక్ష పదవి చేపట్టడం జరిగింది అన్నారు. రాజకీయాలకు అతీతంగా పేద ఆర్యవైశ్యుల అభివృద్ధికి పాటుపడతాను అన్నారు. విద్యా, వైద్యానికి తనవంతుగా అందరి సహకారంతో ప్రాధాన్యత ఇస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, ఇల్లూరు లక్ష్మయ్య, భవనాశి మహేష్, శ్యాంసుందరలాల్‌లకు ఈసందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీ ఫార్మ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉయ్యాలవాడ వాసి


బండారు దస్తగిరి యాదవ్

ఉయ్యాలవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫార్మ మేనేజర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బండారు దస్తగిరి యాదవ్ ఎంపికయ్యారు. గుంటూరులో ఆల్ ఇండియా ఫార్మ మేనేజర్స్ వైస్ ప్రసిడెంట్ ఆధ్వర్యంలో 5వ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాగా రాష్ట్ర అధ్యక్షుడిగా దస్తగిరి యాదవ్ ఎన్నిక కావడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ


ఆలయ ధర్మకర్తకు వెండి కిరీటం అందిస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న శ్రీ జంబులాపరమేశ్వరి అమ్మవారికి పాణ్యం గ్రామానికి చెందిన యశ్వంత్ వెండి కిరీటం బహూకరించారు. అడ్వకేట్ ఆకుల రామకృష్ణ జ్ఞాపకార్థం అందజేసినట్లు వారు వెల్లడించారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయాధికారులు పూజలు చేయించి శేషవస్త్రాలు అందించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): అత్యవసరమైన వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రవీంద్ర హైస్కూల్ కరస్పాండెంట్ రవీంద్రనాథ్ అన్నారు. హీరో అల్లుఅర్జున్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం నంద్యాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు స్థానిక ప్రతాప్ థియేటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రవీంద్ర హైస్కూల్ కరస్పాండెంట్ పాల్గొని మాట్లాడారు. వేసవి కాలంలో రక్త నిల్వలు తక్కువగా ఉంటాయని, రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. శిబిరంలో 50 మందికి పైగా అల్లు అర్జున్ అభిమానులు పాల్గొని రక్త దానం చేశారు.వీరిని అభినందిస్తూ సర్టిఫికెట్లు అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కడపకు చెందిన సాయి నటరాజ నృత్య అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మహాగణపతిం, మూషికవాహన, శివశివశంకరా, నమశ్శివాయ, అమ్మపరమేశ్వరి, అఖిలాండేశ్వరి గీతాలకు తిరుపతి, విజయ బాబు, రాజశేఖర్, శశికళ నృత్యప్రదర్శన చేశారు.

నిరసన మంట



ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంచి పేదలపై భారం విధించడం సరికాదని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కన్వీనర్ సుశీలమ్మ అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని సాయిబాబానగర్ సెంటర్‌లో ఆ సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంచుతూపోతుందన్నారు. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.900 పలకడం ద్వారా సామాన్యుడి కొనే పరిస్థితి లేదన్నారు. కట్టెల పొయ్యి మీద వంట చేసుకునే దుస్థితి వచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్యాస్ ధరను తగ్గించకపోతే ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, సోమన్న, శ్రీనివాసులు, హరినాథ్ పాల్గొన్నారు. –నంద్యాల(న్యూటౌన్)

పోలీస్ హెచ్చరిక



పచ్చని గ్రామాల్లో చిచ్చు పెట్టే విధంగా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆళ్లగడ్డ పట్టణ సీఐ యుగంధర్ హెచ్చరించారు. ఫ్యాక్షన్ గ్రామమైన చింతకుంటను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. చిన్నచిన్న విషయాలకు గొడవలు పడొద్దని, దీని వల్ల తమపై ఆధారపడిన కుటుంబాలు ఇబ్బందులకు గురవుతాయన్నారు. ఏదైనా సమస్య ఉంటే గ్రామ పెద్దలతో మాట్లాడి పరిష్కరించుకోవాలని, తీరకపోతే పోలీసులను ఆశ్రయించాలన్నారు. అలాగే గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సీఐ వెంట ఎస్సై నగీన ఉన్నారు. –ఆళ్లగడ్డ

గిర గిర తిప్పి.. ఆరోగ్యం ఒడిసి పట్టి



ఆటలు ఏవైనా మానసికోల్లాసాన్ని అందిస్తాయి. దీంతోపాటు శారీరకంగా ఫిట్‌గా ఉంచుతాయి. మెదడును చురుకుగా పనిచేసేలా చేస్తాయి. అయితే, స్మార్ట్ ఫోన్ల రాకతో ఆటలు దూరమయ్యాయి. ఖాళీ సమయం దొరికితే చాలు సెల్‌ఫోన్ పట్టుకుంటున్నారు. పిల్లలు మొబైల్‌గేమ్స్‌లో మునిగిపోతున్నారు. దీని వల్ల భవిష్యత్తులో కంటిచూపు కోల్పోవడంతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ ముప్పును పసిగటిన కొందరు పిల్లల చేతికి సెల్‌ఫోన్ ఇవ్వకుండా బయట ఆడుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం దొర్నిపాడు వీధుల్లో కొందరు చిన్నారులు బొంగరం ఆట ఆడుతూ కనిపించారు. – దొర్నిపాడు

11న ఇళ్ల స్థలాల కోసం ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 11వ తేదీన మరోమారు నంద్యాల పట్టణంలోని అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో చాలా మందికి ఇళ్ల స్థలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం అర్హులకు ఇళ్ల స్థలాలు ఇస్తానని మాట తప్పిందన్నారు. పదినెలలవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.ఈనెల 11న నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వస్తున్నారని చెప్పారు. సమావేశంలో ఏపీ మహిళా అధ్యక్షురాలు సుశీలమ్మ, కార్యదర్శి లక్ష్మీదేవి, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, ప్రసాద్, సోమన్న పాల్గొన్నారు.

పెన్షనర్ల ఆశాజ్యోతి ధరమ్ స్వరూప్ నకారా


నివాళులర్పిస్తున్న అసోసియేషన్ నాయకులు

నంద్యాల(అర్బన్): పెన్షనర్ల ఆశాజ్యోతి ధరమ్ స్వరూప్ నకారా అని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శివనాగిరెడ్డి, కార్యదర్శి ఎస్వీఎన్‌వీ ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జయంతిని పురస్కరించుకుని ఆ సంఘం కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ ఇప్పించిన ఘనత ధరమ్ స్వరూప్ నకారాది అని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్ కార్డు ఆధారంగా ప్రభుత్వ, కార్పొరేట్ వైద్యశాలల్లో నగదు రహిత వైద్యం అందించాలన్నారు. చనిపోయిన వారి అంత్యక్రియ ఖర్చులను వెంటనే చెల్లించాలని, రావాల్సిన పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్తార్, పుల్లారెడ్డి, వెంకటరెడ్డి, కొండయ్య, ఆనంద్, యథార్థుడు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


గోస్పాడులో అంగన్‌వాడీల సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి

గోస్పాడు: క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని జూలేపల్లెలో మొదటి రోజు మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లీబిడ్డ ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు దృష్టి సారించాలన్నారు. బరువు తగ్గించుకునేందుకు ఆరోగ్యకర జీవన శైలి అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పోషకాహార ఆవశ్యకతపై అవగాహన

చాగలమర్రి: పోషణ కార్యక్రమంలో భాగంగా పోషకాహారం ఆవశ్యకతపై మంగళవారం ఎంపీడీఓ సమావేశ భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సుశీల మాట్లాడుతూ పోషన్ పక్షోత్సవాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారుల మొదటి 1000 రోజుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎత్తుకు తగిన మేరకు బరువులేని పిల్లలను గుర్తించాలన్నారు. ఊబకాయాన్ని తగ్గించేందుకు ఆరోగ్యకరమైన జీవనశైలి కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

10న జాబ్ మేళా

నంద్యాల (న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 కంపెనీల ప్రతినిధులు వస్తున్నారని.. 500కు పైగా పోస్టుల భర్తీ చేసుకుంటారన్నారు. నంద్యాల జిల్లాలోని నోడల్ రీసోర్స్ సెంటర్ పరిధిలో ఉన్న పాణ్యం, ఎర్రగుంట్ల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, శ్రీశైలం, పరిధిలోని నిరుద్యోగులు హాజరు కావాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్: 9703377803 నంబరును సంప్రదించాలన్నారు.

హోరాహోరీగా పొట్టేళ్ల పోటీలు


ఎదురుపాడులో పొట్టేళ్ల పోటీలను ఆసక్తిగా తిలకిస్తున్న జనం

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన పొట్టేళ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. 13 పొట్టేళ్లు తలపడగా పగిడ్యాల మండలం ప్రాతాకోట లోకేష్ పొట్టేలు విజేతగా నిలిచింది. రెండవ స్థానంలో పగిడాల ధీర పొట్టేలు, మూడో స్థానంలో మిడుతూరు మండలం రోళ్లపాడు అంజి పొట్టేలు, నాల్గవ స్థానంలో పాములపాడు రవి పొట్టేలు నిలిచాయి. పొట్టేళ్ల యజమానులకు వరుసగా రూ.8 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల నగదు బహుమతులు అందజేశారు.

హంసవాహనంపై శ్రీలక్ష్మీరంగనాథుడు


దేదీప్యమానంగా వెలుగొందుతున్న శ్రీలక్ష్మీ రంగనాథస్వామి

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం స్వామి వారు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలతో అలంకరించి సహస్రనామార్చన, కుంకుమార్చన, పుష్పార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారిని అలంకరించిన పల్లకీలో ఆశీనులను చేశారు. గోవింద నామస్మరిస్తూ బోయీలు స్వామివారి పల్లకీని మోస్తూ ఉత్సవ రథం వరకు తెచ్చారు. హంసవాహనంతో అలంకరించిన గ్రామోత్సవ రథంపై స్వామివారిని కూర్చుంబెట్టి గోవిందా నామాన్ని స్మరిస్తూ జయ జయ ధ్వానాల మధ్య రథాన్ని పురవీధుల్లో తిప్పారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు, ఊది బత్తీలు, మంగళ హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారికి బుధవారం శేషవాహనసేవ నిర్వహించనున్నట్లు పూజారి ఈశ్వరరెడ్డి, చైర్మన్ నారాయణరెడ్డి, ఈఓ సాయికుమార్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకం

చాగలమర్రి: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని డీపీఎం కరీం బాషా అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఈఓ మంజులదేవి ఆధ్వర్యంలో ఎంపీడీఓ భవనంలో నిర్వహించిన ఈ సమావేశంలో డీపీఎం మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో రైతులను సమన్వయ పరచి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు వ్యవసాయంలో వస్తున్న మార్పులను తెలియజేయాలన్నారు. ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని చెప్పారు.పీఎండీఎస్ ఉపయోగాలు, 365 రోజులు భూమిపై కప్పి ఉంచడం వలన కలిగే లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంటీఎస్ పత్తి నాగేశ్వరరెడ్డి, జి.రామాంజనేయరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, వీవీఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

కొబ్బరి కాయల సమర్పణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి మంగళవారం కొబ్బరికాయలు సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి, పసుపు, కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపారు. అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించారు. కార్యక్రమంలో స్వామివారి ఆలయ పర్యవేక్షకులు ఎం.హరియానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామి వారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మహిళల జీవనోపాధి కల్పనకు కృషి


యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పీడీ

శిరివెళ్ల: డ్వాక్రా సంఘాల మహిళలకు జీవనోపాధి కల్పన కోసం కృషి చేస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రావణి గ్రామైక్య సంఘం జమ్ములమ్మ, మైత్రి సంఘాల వార్షిక క్రెడిట్ జీవనోపాధుల ప్రణాళికలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మహిళల జీవనోపాధుల కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించిందన్నారు. సంఘంలోని ప్రతి మహిళ గతంలో ఎంత లబ్ధి పొందింది, భవిష్యత్‌లో ఇంకా ఎంత సహాయం కావాలన్నది యాప్‌లో పొందు పరిచినట్లు చెప్పారు. అలాగే నెల నెల సమావేశాలను కూడా ఫొటోలతో సహ ఉన్నతాధికారులకు పంపాల్సి ఉంటుందన్నారు. మండలంలో 1,461 డ్వాక్రా సంఘాలు ఉన్నాయని అందులో 15,597 మంది మహిళలు సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. వారం లోపల అందరి సమాచారాలను యాప్‌లో పొందు పరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజశేఖరరెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

పొలాలు ఇచ్చేందుకు అంగీకారం


రైతులకు చెక్కులు అందజేస్తున్న డిప్యూటీ తహసీల్దార్, కంపెనీ ప్రతినిధి

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు, గోవిందపల్లె గ్రామాల వద్ద ఏర్పాటు చేస్తున్న సోలార్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి రైతులు తమ పొలాలు ఇచ్చేందుకు అంగీకరించినట్లు డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పై గ్రామాలకు చెందిన 29 మంది రైతులు 23.21 ఎకరాలు లీజ్‌కు ఇచ్చేందుకు గతంలో ఒప్పందం కుదరడంతో ఈ మేరకు కంపెనీ ప్రతినిధులకు సమాచారం అందజేశామన్నారు. ఎకరాకు ఏడాదికి రూ. 32 వేలు అద్దె చొప్పున అంగీకరించిన 15 మంది రైతులకు చెక్కులు అందజేశామన్నారు. కార్యక్రమంలో సోలార్ కంపెనీ ప్రతినిధి నరేంద్ర చౌదరి, వీఆర్‌ఓ వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే 100 శాతం పూర్తి చేయాలి


సమావేశంలో వైద్యారోగ్య సిబ్బంది

చాగలమర్రి: వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీసీడీ సర్వేను ఈ నెలాఖరులోపు 100% పూర్తి చేయాలని జిల్లా ఎఫ్‌డీపీ నోడల్ అధికారి, డీడీఓ జగదీష్ చంద్ర రెడ్డి ఆదేశించారు. ఆశ డే సందర్భంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీ సమావేశ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాగలమర్రిలోని 3, 4, 5, మల్లెవేముల సచివాలయాల వైద్యారోగ్య సిబ్బంది సర్వేను వేగవంతం చేయాలన్నారు. సర్వేలో అనుమానిత క్యాన్సర్ కేసులను నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి పి.అంజలి, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంపీఈఓహెచ్ఓ వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ,ఏఎన్‌ఎం, ఆశలు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం


ధ్వజ స్తంభాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


గ్రామోత్సవంలో కళాకారుల చెక్క భజన ప్రదర్శన

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరం పడమటి వీధిలో వెలసిన శ్రీ ప్రతాప రుద్ర ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభం ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు మంగళవారం ఆలయం వద్ద వేద పండితులు శాస్త్రోక్తంగా వివిధ పూజా కార్యక్రమాలు, హోమాలు చేశారు. అనంతరం ధ్వజ స్తంభాన్ని ట్రాక్టర్ ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రతిష్ఠోత్సవాల సందర్భంగా నిర్వాహకులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చెక్క భజన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. బుధవారం ఆలయ శిఖర, ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

ప్రొటోకాల్‌కు కూటమి ప్రభుత్వం తూట్లు

- శిలాఫలకాల్లో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులకు స్థానం కల్పించని వైనం
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మసీదుపురం సర్పంచ్


ఉదయం 11 గంటల వరకు ఒకరిద్దరు వచ్చిన దృశ్యం

మహానంది: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చేసిందే చట్టం అనేలా చేస్తున్నారు. నిబంధనల మేరకు పాటించాల్సిన ప్రొటోకాల్ సైతం పాటించకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తుండటం విమర్శలకు దారి తీస్తోంది. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే శిలా ఫలకాల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజా ప్రతినిధుల పేర్లు లేకుండా, ఎలాంటి పదవుల్లేని అధికార పార్టీకి చెందిన వారి పేర్లు వేయించుకోవడం విమర్శలకు తావిస్తోంది.

మహానంది మండలం మసీదుపురం గ్రామంలో మార్చి 8న నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంలో గ్రామ సర్పంచ్ కాకనూరు లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ మునగాల మల్లికార్జునరెడ్డిల పేర్లు లేవు. కానీ ఎలాంటి పదవుల్లేని అధికార పార్టీ నేత, నామినేటెడ్ పదవులున్న వారి పేర్లు మాత్రమే రాయించడం విమర్శలకు దారి తీసింది. దీంతో గ్రామ సర్పంచ్ లక్ష్మీరెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజకుమారి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వ కార్యక్రమాలకు దక్కని ఆహ్వానం

బుక్కాపురం గ్రామంలో ఈనెల 4న శుక్రవారం రైతు సేవా కేంద్రంలో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా వ్యవసాయ యంత్ర పరికరాలైన గొర్రు, గుంటక, తైవాన్ స్ప్రేయర్లు, రోటావేటర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీ నరసమ్మ, గ్రామ సర్పంచు కందుల వరలక్ష్మమ్మలకు ఎలాంటి ఆహ్వానం దక్కలేదు. వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కావడంతోనే పిలవలేదన్న విమర్శలున్నాయి. కేసీ కెనాల్ ప్రాజెక్ట్ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి చేత పంపిణీ చేయించారు. మరిచిపోయామని అధికారులు చెప్పడం గమనార్హం.

మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు గైర్హాజరు

కూటమి ప్రభుత్వం కుట్రల్లో భాగంగా తమకు గౌరవం ఇవ్వడం లేదన్న మనస్తాపంతో మంగళవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశానికి ఏ ఒక్క ఎంపీటీసీ హాజరు కాలేదు. కేవలం ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని మాత్రమే హాజరయ్యారు. ఉదయం 11 గంటలు దాటినా ఎవరూ హాజరుకాకపోవడంతో సమావేశాన్ని బుధవారం నాటికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్ దౌలా ప్రకటించారు.